క్లుప్తంగా

సమస్యలను పరిష్కరించాలి



బాన్సువాడ: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం బాన్సువాడ మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు సమ్మె చేపట్టారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు రవీందర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. ఈ నెల 6న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేపడుతున్నామని అన్నారు. కార్మికులు బుజ్జిగారి సాయిలు, రాజు, పిట్లం సాయిలు, కంప్యూటర్ ఆపరేటర్ వెంకట్ ఉన్నారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి



నిజాంసాగర్(జుక్కల్): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వడ్డించాలని ఎంఈవో అమర్‌సింగ్ అన్నారు. మహమ్మద్ నగర్ మండలంలోని గున్కుల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు, ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు చేశారు. హెచ్ఎం నారాయణ, ఉపాధ్యాయుడు అనిల్ ఉన్నారు.

హార్టికల్చర్ సాగు పరిశీలన



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని గున్కుల్ గ్రామంలో హార్టికల్చర్ పంటల సాగును, క్యాటిల్ ఫారం నిర్వహణను శనివారం ఈజీఎస్ ఏపీడీ వామన్‌రావ్ పరిశీలించారు. ఏపీవో శివకుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు చంద్రశేఖర్, బాల్‌సింగ్, ప్రభాకర్, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

పారిశుధ్య పనులు పూర్తి చేయాలి



దోమకొండ: మండల కేంద్రంతోపాటు ప్రతి గ్రామంలో పారిశుధ్య పనులు పూర్తి చేయాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆయన పారిశుధ్య పనులను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్యం విషయంలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. కార్యదర్శి యాదగిరి ఉన్నారు.

వంతెన నిర్మాణ ప్రాంతాల తనిఖీ



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): జాతీయ రహదారి ఏర్పాటులో భాగంగా నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం పెద్దవాగుతోపాటు, పోచారం ప్రధాన కాలువపై నూతనంగా నిర్మించాల్సిన వంతెన ప్రాంతాలను శనివారం ఇరిగేషన్ ఎస్ఈ విద్యావతి పరిశీలించారు. నూతనంగా నిర్మించాల్సిన వంతెన నిర్మాణాల నమూనాలను హైవే అధికారుల నుంచి తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు ఆమె సూచించారు. ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు, ఈఈ మల్లేశ్, ఏఈ అక్షయ్, వర్క్ఇన్‌స్పెక్టర్ యాదగిరి ఉన్నారు.

గత ప్రభుత్వ వైఫల్యంతోనే కళాశాల తరలింపు యత్నం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గత ప్రభుత్వ వైఫల్యంతోనే మండలంలోని మాల్తుమ్మెద వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల తరలించే యత్నం జరుగుతుందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్ ఆరోపించారు. మండలంలోని పోచారంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలిటెక్నిక్ కళాశాలలో సరైన సౌకర్యాలను గత ప్రభుత్వం కల్పించలేదని, దీంతో విద్యార్థులు కళాశాలలో చేరడానికి ఆసక్తి చూపడం లేదన్నారు. ఈక్రమంలో అధికారులు మాల్తుమ్మెద కళాశాలను తాత్కాలికంగా మరోచోటుకు తరలించే యత్నం చేస్తున్నారన్నారు. కేవలం తమ ఉనికి కాపాడుకునేందుకు మాత్రమే కొందరు నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారన్నారు. రజితరెడ్డి, వెంకట్రాంరెడ్డి, గంగారెడ్డి, రాంచందర్‌రెడ్డి, వాసురెడ్డి, శ్రీరాంగౌడ్, శుభాకర్‌రెడ్డి, నర్సాగౌడ్, గోపాల్, సురేందర్‌గౌడ్, భూపాల్‌రెడ్డి, పీర్‌రెడ్డి ఉన్నారు.

జోరుగా చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ జోరందుకుంది. శుక్రవారం నాటికి లక్షా 79వేల 21 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

తీరనున్న ప్రయాణ కష్టాలు

- భిక్కనూరు నుంచి తలమడ్ల వరకు డబుల్ రోడ్డు మంజూరు
- ప్రారంభమైన పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు





భిక్కనూరు నుంచి తలమడ్ల వరకు జరుగుతున్న రోడ్డు వెడల్పు పనులు

భిక్కనూరు: మండల ప్రజలకు ప్రయాణ కష్టాలు తీరనున్నాయి. భిక్కనూరు నుంచి తలమడ్ల వరకు ఉన్న సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో ఇటీవల పనులు ప్రారంభమయ్యాయి. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాజంపేట వరకు విస్తరించాలి..

ప్రస్తుతం మంజూరు అయిన నిధులతో భిక్కనూరు నుంచి తలమడ్ల వరకు మాత్రమే రోడ్డు వెడల్పు పనులు జరుగుతాయి. భిక్కనూరు నుంచి రాజంపేట వరకు పూర్తిగా డబుల్‌రోడ్డు నిర్మాణం జరిగితే రెండు మండలాల ప్రజలతో పాటు మెదక్ జిల్లా ప్రజలకు కూడా మేలు కలుగుతుంది. తలమడ్ల నుంచి శివాయిపల్లి మీదుగా రాజంపేట మండల కేంద్రం వరకు పూర్తిగా డబుల్ రోడ్డు నిర్మాణానికి ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

మొదటి విడతగా రూ.19కోట్లు..

భిక్కనూరు, రామేశ్వర్‌పల్లి, తిప్పాపూర్, మోటాట్‌పల్లి, ఆరేపల్లి తండా, ఆరేమల్లి, తలమడ్ల శివాయిపల్లి మీదుగా రాజంపేట మండల కేంద్రం వరకు డబుల్ రోడ్డును చేయాలని ప్రభుత్వం సంకల్పించి నిధులను మంజూరి చేసింది. పంచాయతీ పరిధిలోని ఈ రోడ్డును ఆర్అండ్‌బీకి బదలాయించారు. కొద్దినెలల క్రితం మొదటి విడతగా రూ.19కోట్ల నిధులు మంజూరు అవడంతో భిక్కనూరు నుంచి తలమడ్ల వరకు రోడ్డును డబుల్‌రోడ్డుగా మార్చేందుకు అధికారులు టెండర్లను పిలిచారు. టెండర్ దక్కించుకున్న వారు ఇటీవల పనులు ప్రారంభించారు. మొత్తం తొమ్మిది మీటర్ల వెడల్పుతో రోడ్డును నిర్మిస్తున్నారు. ఇందులో ఏడు మీటర్లు బీటీ రోడ్డును నిర్మిస్తారు. బీటీ రోడ్డుకు ఇరువైపుల ఒక్కో మీటర్ మొరంను వేస్తారు. ప్రస్తుతం ఉన్న సింగిల్ రోడ్డు వల్ల కొన్ని సందర్భాల్లో ఎదురుగా ఫోర్‌వీలర్ వాహనం వస్తే మరో ఫోర్ వీలర్ వాహనం వెళ్లేందుకు ఇబ్బంది ఉండేది. డబుల్ రోడ్డుతో ఈ ఇబ్బంది తొలగుతుంది.

సింగిల్ రోడ్డుతో ఇబ్బంది ఉండేది..



భిక్కనూరు నుంచి తలమడ్ల వరకు డబుల్ రోడ్డు పనులు ప్రారంభం అవడం ఎంతో ఆనందంగా ఉంది. సింగిల్ రోడ్డుపై ప్రయాణించేటపుడు ఎదురుగా ఎలాంటి వాహనం వచ్చినా ఎవరో ఒకరూ రోడ్డు దిగాల్సి వచ్చేది. డబుల్ రోడ్డు పూర్తయితే ఇబ్బందులు లేకుండా ప్రయాణం చేయవచ్చు.

–మహమ్మద్ సలావుద్దీన్, తిప్పాపూర్

పనులు త్వరగా పూర్తిచేయాలి



డబుల్ రోడ్డుతో మండల ప్రజల ప్రయాణ కష్టాలు తీరనున్నాయి. భిక్కనూరు నుంచి తలమడ్ల వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు తొందరగా పూర్తి చేయాలి. నాణ్యతతో పనులు జరిగేలా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలి.

–బోయిని శ్రీనివాస్, మోటాట్‌పల్లి

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతం చేయండి



తాండూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న అధికారులు



కాళోజీవాడిలో..



దోమకొండలో..

నాగిరెడ్డిపేట/తాడ్వాయి/దోమకొండ/బాన్సువాడ రూరల్: గ్రామాల్లో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని అధికారులు సూచించారు. జిల్లాలోని పలు మండలాల్లో కొనసాగుతున్న సర్వేను స్థానిక అధికారులు శనివారం పరిశీలించారు. నాగిరెడ్డిపేట మండలంలోని తాండూర్‌లో చేపట్టిన సర్వేను ఎంపీడీవో ప్రభాకరచారి తనిఖీ చేశారు. తాడ్వాయి మండలం ఎర్రాపహాడ్, కాలోజీవాడి, కన్‌కల్, కరడ్‌పల్లి గ్రామాలలో సర్వేను ఎంపీడీవో సయ్యద్ సాజీద్‌అలీ పరిశీలించారు. మండలంలో 99శాతం సర్వే పూర్తయిందని ఎంపీడీవో తెలిపారు. దోమకొండ మండల కేంద్రంలో సర్వేను ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. బాన్సువాడ రూరల్ మండలంలోని మొగులాన్‌పల్లి, తిర్మలాపూర్, కొత్తాబాది గ్రామాల్లో ఇందిరమ్మ ఇంటి సర్వేను బాన్సువాడ ఎంపీడీవో బషీరుద్దీన్ పరిశీలించారు. ఈసందర్భంగా వారు సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. స్థానిక సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి





జుక్కల్‌లో వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు.. బాన్సువాడలో కరపత్రాల ఆవిష్కరణ

నిజాంసాగర్(జుక్కల్): ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలను పాటించాలని ఎస్సై భువనేశ్వర్ అన్నారు. జుక్కల్ మండల కేంద్రంలో శనివారం ఆయన వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని, ట్రిపుల్ రైడింగ్ ప్రయాణం చేయవద్దన్నారు. వాహనాల ధ్రువపత్రాలు, లైసెన్స్‌లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

బాన్సువాడ: పట్టణంలోని న్యూటాన్ హైస్కూల్‌లో శనివారం జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను విద్యార్థులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాన్సువాడ సహాయక మోటార్ వాహన తనిఖీ అధికారి మహేష్‌కుమార్ మాట్లాడుతూ.. రోడ్డు భద్రత నిబంధనలను ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలని అన్నారు. హోంగార్డు అనీల్‌కుమార్, ప్రిన్సిపల్ మహేందర్ తదితరులు ఉన్నారు.

లైబ్రరీ నిర్మాణ పనులు పూర్తి చేయిస్తాం



పెద్దకొడప్‌గల్‌లో నిలిచిన లైబ్రరీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న చంద్రకాంత్ రెడ్డి

పెద్దకొడప్‌గల్/పిట్లం: మండల కేంద్రంలో నిలిచిన గ్రంథాలయ నిర్మాణ పనులను ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు సహకారంతో పూర్తిచేయిస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. పెద్దకొడప్‌గల్‌లో లైబ్రరీ నిర్మాణ పనులు శనివారం ఆయన పరిశీలించారు. స్థానికులు లైబ్రరీ సమస్యను విన్నవించగా ఆయన సానుకూలంగా స్పందించారు. అనంతరం ఆయన పిట్లం గ్రంథాలయాన్ని, రికార్డులను పరిశీలించారు. చైర్మన్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో శాఖ గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. చైర్మన్‌ను జుక్కల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇమ్రోజ్ సన్మానించారు. నాయకులు మహేందర్‌రెడ్డి, మోహన్, పండరి, సంతోష్, బస్వరాజ్ దేశాయ్, రాములు, హన్మండ్లు, కృష్ణారెడ్డి, అడ్వకేట్ రాంరెడ్డి, మోహన్‌రెడ్డి, కుమ్మరి రాములు, దయానంద్ పాల్గొన్నారు.

5నుంచి రాజకీయ శిక్షణ తరగతులు

రాజంపేట: కాంగ్రెస్ పార్టీ జాతీయ ఆదివాసీ రాజకీయ శిక్షణ తరగతులు నాగార్జునసాగర్‌లో ఈనెల 5నుంచి నిర్వహించనున్నట్లు ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. టీపీసీసీ ఆదివాసీ చైర్మన్ డాక్టర్ బెల్లయ్య నాయక్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాకు చెందిన గుగ్లోత్ వినోద్, బానోత్ మదన్‌లాల్ కార్యక్రమంలో పాల్గొననున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా 250 మందిని కాంగ్రెస్ పార్టీ గిరిజన నాయకులను డెలిగేట్స్‌గా ఎంపిక చేశారని, పార్టీ అగ్ర నాయకులు రానున్నట్లు తెలిపారు.

వచ్చే నెల 7న 'వేయి గొంతులు-లక్ష డప్పులు'



రామారెడ్డి: ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో 'వేయి గొంతులు-లక్ష డప్పులు' కార్యక్రమం నిర్వహించి, మాదిగల గుండెచప్పుడును కాంగ్రెస్ ప్రభుత్వానికి వినిపిస్తామని ఎమ్మార్పీఎస్ జిల్లా పర్యవేక్షుడు మంథని సామ్యేల్ తెలిపారు. మండలంలోని మద్దికుంట గ్రామంలో శనివారం ఎమ్మార్పీఎస్ నేతలు డప్పులతో ర్యాలీ నిర్వహించి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీలను ఎన్నుకున్నారు. నాయకులు కొత్తోల్ల యాదగిరి, సట్టిగారి లక్ష్మి, బానపురం లావణ్య, కాస్తారి శైలేష్, కర్రెం బాలరాజు, తాండ్ర మల్లేష్, పల్లె స్వామి, గిరిసాయిలు, చిన్నవారి లింగం, సురేందర్, అఖిల్ ఉన్నారు.

ఆలయాల అభివృద్ధికి రూ.10 లక్షల విరాళం



దోమకొండ: మండల కేంద్రంలోని చాముండేశ్వరి ఆలయానికి రూ.5లక్షలు, శివరాంమందిర్ ఆలయ అభివృద్ధి మరో రూ.5లక్షలు దోమకొండ గడికోట ట్రస్టు ఆధ్వర్యంలో ప్రకటించారు. అపోలో ఆస్పత్రుల డైరెక్టర్ కామినేని శోభన, గడికోట వారసులైన కామినేని అనిల్‌కుమార్ శనివారం సంబంధిత చెక్కులను ఆయా ఆలయాల కమిటీ ప్రతినిధులకు అందజేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దాతలను సన్మానించారు.

మహాసభలను జయప్రదం చేయాలి

కామారెడ్డి టౌన్: సంగారెడ్డిలో ఈ నెల 25నుంచి 28వరకు జరిగే సీపీఎం 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకట్‌గౌడ్, మోతీరాం నాయక్, కొత్త నర్సింలు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్ పరిశీలన

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని కుప్రియాల్, ధర్మారావ్‌పేట్ గ్రామాల శివారుల్లో గల సోలార్ ప్లాంట్లను జెడ్పీ సీఈవో, మండల ప్రత్యేకాధికారి చందర్ నాయక్ పరిశీలించారు. ప్లాంట్ నిర్వహణ, విధి, విధానల తీరుపై సిబ్బందితో మాట్లాడారు. ఎంపీవో సురేందర్ రెడ్డి, ఏపీఎం రాజిరెడ్డి, ఏపీవో శ్రీనివాస్, ఈసీ మధు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తం

షబ్బీర్ అలీని కలిసిన కాంగ్రెస్ నేతలు



బీబీపేట: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీని శనివారం కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రావణ్‌కుమార్, చంద్రాగౌడ్ మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.


పాఠశాలకు ప్రొజెక్టర్ అందజేత

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని గున్కుల్ గ్రామ ప్రభుత్వ పాఠశాలకు భానుప్రకాష్‌గౌడ్ తన తాత భూమాగౌడ్ జ్ఞాపకార్థం ప్రొజెక్టర్‌తోపాటు కంప్యూటర్ సామగ్రిని అందజేశారు. ఎంఈవో అమర్‌సింగ్, నాయకులు రమేష్‌యాదవ్, కిష్టారెడ్డి, సాయాగౌడ్, హెచ్ఎంనారాయణ ఉన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

మాచారెడ్డి: మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహం విద్యార్థులకు శనివారం మండల వైద్యాధికారి ఆదర్శ్ వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అధికారులు చక్రధర్, వెంకటేశ్వర్‌రావ్, సిబ్బంది ఉన్నారు.

కళాశాలలో మెడిటేషన్ తరగతులు



మాచారెడ్డి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శనివారం విద్యార్థులకు మెడిటేషన్ తరగతులు నిర్వహించారు. హియర్ ఫుల్ నెస్ మెడిటేషన్ కేంద్రం చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ శ్రీరాం, ప్రిన్సిపాల్ యాస్మిన్ ఉద్దిన్, అధ్యాపకులు ఉన్నారు.

డిక్షనరీల పంపిణీ

బీబీపేట: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం కాగ్నిజెంట్ కంపెనీ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు డిక్షనరీలు పంపిణీ చేశారు. పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు రూ.50వేల స్కాలర్‌షిప్ ఇస్తామని, డిగ్రీ తర్వాత ఉద్యోగం కూడా ఇస్తామని తెలిపారు. కంపెనీ మేనేజర్ బాల ప్రసాద్, హెచ్ఎం రామేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరీక్షప్యాడ్ల వితరణ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని ఫిర్మాయికుంటతండా ప్రాథమిక పాఠశాలలో శనివారం మన హెల్పింగ్‌బ్రిడ్జ్‌ఫర్‌ఎడ్యూకేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షప్యాడ్లు, ఇతర సామగ్రిని పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధులు సుజితాకృష్ణాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఐడీ కార్డులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పోచారం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం ఐడీ కార్డులను వితరణ చేశారు. ఇటీవల నూతనంగా ఉపాధ్యాయుడిగా ఉద్యోగం పొందిన ఉదయ్‌కిరణ్ తన తొలి వేతనంతో విద్యార్థులందరికీ ఐడీ కార్డులను తయారు చేయించి అందజేశారు. ఎంఈవో భాస్కర్‌రెడ్డి, కాంప్లెక్స్ హెచ్ఎం వెంకట్రాంరెడ్డి, హెచ్ఎం ఉదయ్‌కిరణ్ పాల్గొన్నారు.


అనారోగ్యంతో కాంగ్రెస్ నాయకుడి మృతి

బాన్సువాడ రూరల్: మండలంలోని తాడ్కోల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బ్రాహ్మణ సేవాసంఘం బాన్సువాడ మాజీ అధ్యక్షుడు పద్మాకర్‌రావు దేశాయ్ శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి పట్ల కాంగ్రెస్ నాయకులు సంతాపం తెలిపారు. నేడు గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

10నుంచి కేపీఎల్ టోర్నీ

బాన్సువాడ రూరల్: మండలంలోని కొత్తాబాది గ్రామంలో ఈనెల 10నుంచి కొత్తాబాది ప్రీమియర్ లీగ్ (కేపీఎల్) నిర్వహించనున్నారు. విజేతకు రూ.25,555, రన్నరప్‌కు రూ.15,555 అందిస్తామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు రూ.1111చెల్లించి పేర్లు నమోదు చేసుకుంటే 9న డ్రా తీస్తామని నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి గలవారు 7981811021, 6303752863ను సంప్రదించాలన్నారు.

ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి



గాంధారి(ఎల్లారెడ్డి): మండలంలోని గౌరారం కలాన్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం బ్రెయిలీ లిపి సృష్టికర్త లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా, ప్రపంచ అందుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భం బ్రెయిలీ చిత్రపటానికి ఎంఈవో శ్రీహరి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఫైర్‌మన్ ఉద్యోగానికి ఎంపిక

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని భవానిపేట గ్రామానికి చెందిన చాకలి రాజు ఫైర్‌మెన్‌గా ఉద్యోగం సాధించి శనివారం ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. కుమారుడికి ఉద్యోగం రావడంతో తల్లిదండ్రులు గోపాల్, సంగవ్వలు హర్షం వ్యక్తం చేశారు.

ఇంగ్లిష్ భాషా పోటీల్లో ప్రతిభ

దోమకొండ: మండల స్థాయి ఇంగ్లీష్ బాషా పోటీల్లో మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి రుత్విక్ తృతీయ స్థానంలో నిలిచినట్లు హెచ్ఎం రాధాలక్ష్మీ శనివారం తెలిపారు. ఈసందర్భంగా వారు విద్యార్థిని అభినందించారు.

మౌంటెన్ సైక్లింగ్ విజేత అనిల్‌కు అభినందన



కామారెడ్డి అర్బన్: మండలంలోని క్యాసంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి అనిల్ తేజ్ ఆదిలాబాద్‌లో ఇటీవల నిర్వహించిన అంతర్‌జిల్లాల మౌంటెన్ సైక్లింగ్ పోటీల్లో ప్రతిభ చూపి ద్వితీయ స్థానం సాధించి వెండి పతకం, ప్రశంసా పత్రం పొందారు. ఈసందర్భంగా శనివారం పాఠశాలలో అనిల్‌తేజ్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. ఇన్‌చార్జి హెచ్ఎం నర్సింహరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ

కామారెడ్డి టౌన్: హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన రాష్ట్ర జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, 46వ వార్డు కౌన్సిలర్ భర్త లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. అండర్–45 విభాగం 10కి.మీ రన్నింగ్ పోటీలో రాష్ట్రస్థాయిలో నాలుగో స్థానంలో నిలిచాడు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని నల్లమడుగు గ్రామంలో గ్రామస్తులకు శనివారం సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫరేషన్ స్వచ్ఛంద సంస్థ, కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై సంస్థ కౌన్సిలర్ మన్నె కృష్ణ అవగాహన కల్పించారు. ప్రతినిధులు అనిత, మంజుల, ప్రజలు పాల్గొన్నారు.

రెజ్లింగ్ పోటీల్లో ప్రతిభ

పెద్దకొడప్‌గల్(జుక్కల్): హన్మకొండలో ఇటీవల జరిగిన సీఎం కప్ రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో మండలంలోని పోచారం గ్రామానికి చెందిన అనిల్ సత్తా చాటి రెండవ స్థానం సాధించాడు. ఈసందర్భంగా అనిల్‌ను గ్రామస్తులు శనివారం అభినందించారు.

బోరు మోటారు ప్రారంభం



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని 1వ వార్డు అడ్లూర్‌లో శనివారం నూతన బోరు మోటారును మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ ప్రారంభించారు. వార్డు కౌన్సిలర్ గడ్డమీది రాణి, నాయకులు, కాలనీ వాసులు మహేష్, సంతోష్, భూమయ్య, ఈశ్వర్, రాజేందర్ తదితరులున్నారు.

పాఠశాలకు బీరువా బహూకరణ




ఎల్లారెడ్డిరూరల్: లింగారెడ్డిపేట ప్రాథమిక పాఠశాలకు శనివారం కామారెడ్డికి చెందిన ఉమాకాంత్ అనే ఉపాధ్యాయుడు బీరువాను బహూకరించారు. ఉపాధ్యాయులు దాశీరాం, రామకృష్ణ తదితరులున్నారు.

జాబ్ మేళాకు అనూహ్య స్పందన

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని మంజీరా డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన జాబ్ మేళాకు అనూహ్య స్పందన లభించింది. తెలంగాణ అకాడమి స్కిల్స్ నాలెడ్జ్ ఆధ్వర్యంలో ఎంఎస్ఎన్ కంపెనీలో ఉద్యోగాల కోసం జాబ్‌మేళా నిర్వహించగా 230 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ప్రతిభ చూపిన వారికి ఉద్యోగ అవకాశం కల్పించారు. కళాశాల చైర్మన్ గురువేందర్, కంపెనీ ప్రతినిధులు జనార్ధన్, సీతారాం, టాస్క్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయంలో పూజలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పల్లకీసేవ నిర్వహించారు.

కొనసాగుతున్న హమాలీల సమ్మె



ఎల్లారెడ్డి/కామారెడ్డి టౌన్/బాన్సువాడ: జిల్లాలో హమాలీలు చేపట్టిన సమ్మె శనివారం నాలుగో రోజు కొనసాగింది. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎల్లారెడ్డిలో హమాలీలు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు,. అలాగే కామారెడ్డిలో హమాలీలు ర్యాలీ నిర్వహించి, అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. బాన్సువాడలో ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. ఏఐటీయూసీ నాయకులు, హమాలీలు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన వీఆర్‌వోలు



కామారెడ్డి అర్బన్: పట్టణంలోని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌తో పాటు అడిషనల్ కలెక్టర్లను శనివారం వీఆర్వోల సంక్షేమ సంఘం నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ రెవెన్యూ అధికారుల వ్యవస్థను ప్రభుత్వం పునరుద్ధరణ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. నాయకులు దుబాషిమాణిక్యం, రవి, సత్యం,ప్రవీణ్, హన్మాండ్లు, రమేష్, లక్ష్మీనర్సవ్వ ఉన్నారు.

గిరిజన కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన నాయకులు



కామారెడ్డి టౌన్: కామారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ఎన్నికైన గణేష్ నాయక్ శనివారం తెలంగాణ గిరిజన కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. ఆయన్ని సన్మానించారు. అనంతరం గణేష్‌నాయక్‌కు ఆయన అభినందనలు తెలిపారు. ఎస్టీ సెల్ జిల్లా చైర్మన్ రాణా ప్రతాప్ రాథోడ్, వైస్ చైర్మన్ నరేష్ రాథోడ్‌లు ఉన్నారు.